క్లుప్తంగా

కర్ణాటక గవర్నర్‌కు స్వాగతం



కర్ణాటక గవర్నర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి విచ్చేసిన కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌కు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ స్వాగతం పలికారు. బెంగళూరు నుంచి తిరుపతికి రోడ్డు మార్గాన వెళ్తున్న కర్ణాటక గవర్నర్ ఆదివారం చిత్తూరు ఆర్అండ్‌బీ అతిథిగృహానికి విచ్చేశారు. ఈ మేరకు ఆయనకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కర్ణాటక గవర్నర్ కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం తిరుపతికి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. అనంతరం ఆయనకు జిల్లా యంత్రాంగం తరఫున కాణిపాకం విఘ్నేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె సూచించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కాగలరని తెలిపారు.

వైభవంగా గుర్రప్పస్వామి తిరునాళ్ల



గుర్రప్పస్వామికి పూజాసామగ్రి, పుష్పాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని అరగొండలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గుర్రప్ప స్వామి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పరిమళ పుష్పాలు, ప్రసాదాలను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సమర్పించారు. అనంతరం గుర్రప్ప స్వామికి అభిషేకం, పూజలు చేయించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రిలో గుర్రప్ప స్వామిని పల్లకిలో ఊరేగించారు. భక్తులు ఇంటింటా పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పసిప్రాణం..పోషక లోపం

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారు. వేలాదిమంది పిల్లలు పౌష్టికాహార లోపానికి గురవుతున్నారు. పౌష్టికాహార లోపంతో పాటు ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు అధికంగా ఉన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది.

- పుట్టే పిల్లల్లో తగ్గుతున్న పెరుగుదల
- తక్కువ బరువుతో జననాలు
- వెంటాడుతున్న పౌష్టికాహార లోపం
- అనారోగ్యం బారిన పడుతున్న పసిపిల్లలు
- తల్లిదండ్రుల్లో లోపిస్తున్న అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పుట్టిన పిల్లలు పౌష్టికాహార లోపం బారిన పడడం వల్ల పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి మాతాశిశు ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఫలితం ఇవ్వడం లేదు. పుట్టే ప్రతి బిడ్డ ఆరోగ్యంగా, పుట్టినట్లయితే సమస్యలు ఉండవు. పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు అనేక అనారోగ్య సమస్యలతో పుడుతున్నారు. తల్లులు బలహీనంగా ఉండడం, గర్భస్థ సమయంలో అనారోగ్యానికి గురి కావడం, తక్కువ వయస్సులో వివాహాలు చేయడం, మహిళల్లో రక్తహీనత తదితర కారణాల వల్ల పుట్టే పిల్లల్లో కొంతమంది పౌష్టికాహార లోపం, బరువు తక్కువగా పుడుతున్నారు. చిత్తూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలో 227 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 9,344 మంది ఆరేళ్లలోపు పిల్లలు ఉన్నారు. వీరిలో 2,313 మంది ఎత్తు తక్కువగా ఉన్నారు. అదేవిధంగా బరువు తక్కువగా ఉన్నవారు 3,514 మంది ఉన్నారు. 900 మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో ఉన్నారు.



ఎత్తు కొలుస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఎత్తు, బరువు తూనిక..

పిల్లల బరువు, ఎత్తు తెలుసుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పరికరాల ద్వారా తూనిక వేస్తారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రత్యేక పౌష్టికాహారం..

6 నెలల లోపు పిల్లలు బరువు తక్కువగా ఉన్నా, పౌష్టికాహార లోపం ఉన్నా తల్లిపాలు ఆరు నెలలు పాటు తాగించాలని అంగన్‌వాడీ కార్యకర్త పిల్లల ఇంటికి వెళ్లి తల్లికి చెబుతారు. 6 నెలలు దాటిన పిల్లలకు అయితే తల్లిపాలతో పాటు బాలామృతం, 100 ఎంఎల్ పాలు, గుడ్డు ఇస్తారు. ఇటువంటి వారికి ఆహారాన్ని రోజులో 8 సార్లు ఇస్తారు.

0-2 సంవత్సరాల వరకు ఉండాల్సిన బరువు, ఎత్తు

వయస్సు	బరువు కిలోలు	ఎత్తు సెం.మీ
పుట్టినప్పుడు	3.3	49.9
3 నెలలు	6.4	61.4
6 నెలలు	7.9	67.6
9 నెలలు	8.9	72
12 నెలలు	9.6	75.7
15 నెలలు	10.3	79.1
18 నెలలు	10.9	82.3
21 నెలలు	11.5	85.1
24 నెలలు	12.2	87.8

నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పౌష్టి కాహార లోపం, బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను పౌష్టికాహార లోపం ఉన్నట్లు గుర్తించి వారికి ప్రత్యేకమైన పౌష్టికాహారాన్ని అందిస్తాం. సాధారణంగా ప్రతి వ్యక్తి రోజులో మూడుసార్లు ఆహారంగా తీసుకుంటారు. తల్లులకు కూడా పౌష్టికాహార విషయంపై అవగాహన కల్పిస్తున్నాం. – శ్యామ్ సుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

ఘనంగా గెరిగ ఊరేగింపు



మునీశ్వరస్వామి గెరిగను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం మునీశ్వరస్వామికి భక్తితో గెరిగ ఊరేగింపు చేశారు. భక్తిశ్రద్ధలతో మునీశ్వరస్వామి గెరిగను అలంకరించి పొంగళ్లు ఎత్తుకుని ఊరేగింపు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మునీశ్వర స్వామి మట్టితో ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆడిమాసంలో ఏటా మునీశ్వరస్వామికి భక్తులు భక్తి ప్రపత్తులతో పూజలు చేయడం ఆనవాయితీ.

భక్తిశ్రద్ధలతో ఆడిపూజలు





గుడిపాల:బంగారక్క అమ్మవారికి పొంగళ్లను తీసుకెళ్తున్న మహిళలు, పూజలు చేస్తున్న మహిళలు

గుడిపాల: బంగారక్క అమ్మవారికి ఆడిపూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం వసంతాపురం గ్రామంలోని మహిళలు పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉదయం ఉపవాసాలతో అమ్మవారి వద్దకు వెళ్లి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కడే పొంగళ్లను పెట్టి మంగళ వాయిద్యాల నడుమ పూజలు చేశారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలకు హాజరైన ప్రజలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు పేర్లు నమోదు చేసుకుంటున్న దృశ్యం

ఐరాల: ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణులకు ఎంతో మేలు చేకూరుతుందని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వజ్రోత్సవ ప్రారంభ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి, బెంగళూరు శంకర క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బంగారుపాళెం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. కంటి వైద్య శిబిరానికి, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 246 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్యురాలు భావన మాట్లాడుతూ తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్న 46 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించామన్నారు. వీరిలో 26 మందికి కళ్లజోడు అవసరమని గుర్తించి పంపిణీ చేశామన్నారు. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు 153 మంది హాజరై పరీక్షలు చేయించుకోగా ఎవరికీ వ్యాధి నిర్ధారణ కాలేదని డాక్టర్ రవళి తెలిపారు. అదేవిధంగా స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది 200 మందికి బీపీ, షుగర్, సాధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరం విజయవంతం కావడానికి సహకరించిన తిరుపతి, బెంగళూరు వైద్య బృందానికి, పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బందికి, ఎన్‌సీసీ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య శిబిరాల ఇన్‌చార్జ్ గౌరీశంకర్, వలంటీర్ శ్రీకాంత్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివంక ఆలయంలో భక్తుల సందడి

గుడుపల్లె: ఆడి నెల ప్రారంభమై 18 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గుడివంకలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆడి–18 వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వస్త్రాలు, రంగురంగుల పూలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు భక్తిశ్రద్ధలతో వివిధ రకాలు కావళ్లతో ఆలయానికి వచ్చి పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి గంగ పూజలు చేశారు. అనంతరం కొండపైకి చేరుకుని ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి కావళ్లు సమర్పించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు గంధం..రేపు ఉరుసు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం దర్గా సర్కిల్‌లోని దర్గాలో రెండు రోజుల పాటు గంధం, ఉరుసు వేడుకలు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు జరుగుతుందన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఊరేగింపు ఉంటుందన్నారు. కాగా ఈ రెండు రోజుల పాటు జరిగే వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు: మండలంలోని ఓ గ్రామానికి చెంది న బాలిక శనివారం సాయంత్రం పొలం వద్ద కు వెళ్లి తిరిగి రాలేదు. బాలిక తండ్రి పలుచోట్ల వెతికి నా ఆచూకీలేదు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యా దు చేశారు. కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టామని ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు.

ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు సమీపంలోని పదిపుట్ల బైలు రిజర్వు ఫారెస్టులో ఏనుగులు సంచరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఫారెస్టు అధికారులు తెలిపారు. రాత్రిళ్లు పొలాల వద్ద పడుకోవద్దని, ఏనుగులు కనిపించినా తరమవద్దని హెచ్చరించారు. ఏనుగుల సమాచారం తెలిసిన వెంటనే 9550067503 నంబర్‌కు కాల్ చేసి తెలపా లని తెలిపారు. తెల్ల బట్టలు ధరించవద్దని, ఏనుగుల అలికిడి వినిపించినా అదిలించడం, తరమ డం చేయకూడదన్నారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానికులకు అవగాహన కల్పించారు.

భారంగా మారిన

వీఐపీ అంబులెన్స్‌లు

జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో వీఐపీ ప్రొటోకాల్ అంబులెన్స్‌లు భారంగా మారాయి. ఎప్పుడో ఒక సారి ఆ ప్రాంతాల్లో వీఐపీలు పర్యటనకు వచ్చినప్పుడు అగ్నిమాపక వాహనంతోపాటు ప్రొటోకాల్ అంబులెన్స్‌లు వినియోగిస్తూ వుంటారు. మిగిలిన రోజుల్లో ఇవి ఆస్పత్రుల్లో అలంకారప్రాయంగా వుంటున్నాయి. వీటి నిర్వహణ, డీజిల్, డ్రైవర్ జీతాలను సంబంధిత ఆస్పత్రులకు వచ్చే నిధుల నుంచి ఖర్చు చేయడం భారం మారింది. ఈ క్రమంలో ఈ వాహనాలు తమకొద్దంటూ సంబంధిత ఆస్పత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నారు.

- ఆస్పత్రుల నిధులతో వాటి నిర్వహణ
- సమస్యలకే సరిపోని నిధులు
- అదనపు భారమంటున్న ఆస్పత్రి అధికారులు



పలమనేరు ఆస్పత్రి షెడ్‌లో ఉన్న వీఐపీ ప్రొటోకాల్ అంబులెన్స్

పలమనేరు: వీఐపీలు వచ్చినప్పుడు వినియోగించేందుకు గాను అంబులెన్స్‌లను నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా పలు ఆస్పత్రులకు కేటాయించారు. వీఐపీలు ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇందులో వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు, ఆక్సిజన్ తదితరాలతో సిద్ధంగా ఉండాలి. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీటీడీ నిర్వహణలో వున్న రుయా, స్విమ్స్‌లోని ప్రొటోకాల్ వాహనాలకు పెద్దగా నిధుల సమస్యలేదు. ఇక చిత్తూరులోని అంబులెన్స్‌ల నిర్వహణ అపోలో వారు చూసుకుంటున్నారు. కుప్పానికి సంబంధించిన వాహనం నిర్వహణ బాధ్యతను పీఈఎస్ మెడికల్ కళాశాల వారు చేపట్టారు.

పలమనేరులో తప్పని భారం

పలమనేరు ఏరియా ఆస్పత్రికి ఇచ్చిన ప్రొటోకాల్ అంబులెన్స్‌కు మొన్నటి వరకు డ్రైవర్ కూడా లేడు. అవసరం వచ్చినప్పుడు డీసీహెచ్ఎస్ కార్యాలయం నుంచి డ్రైవర్ రావాల్సిందే. ఈ వాహనానికి సర్వీసు చేయించడం, డీజిల్, ఇతర మరమ్మతులకు స్థానిక ఆస్పత్రి నిధులనే వాడుతున్నారు. ఈ క్రమంలో నిర్వహణ కష్టంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన నిధుల నుంచి డ్రైవర్‌కు జీతం ఇస్తామని చెప్పినట్టు తెలిసింది. వాహనం నిర్వహణ బాధ్యతను ఆస్పత్రి నుంచి కాకుండా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం చూసుకుంటే బాగుటుందనే మాట వినిపిస్తోంది. ఈ విషయమై స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణిని వివరణ కోరగా వీఐపీ అంబులెన్స్ తమకు భారంగా మారినమాట నిజమేనన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తన నిధుల నుంచి డ్రైవర్‌కు జీతాలు ఇస్తామని చెప్పారని తెలిపారు.

కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీద్దాం

- 143 హామీలేమయ్యాయి చంద్రబాబు ?
- గ్రామాల్లో పర్యటించాలంటే టీడీపీ నాయకులకు వణుకు
- రైతు సంక్షేమాన్ని గాలికొదిలేశారు
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో విజయానందరెడ్డి



క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల సమయంలో 143 హామీలు ఇచ్చి అధికారం దక్కించుకుని 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీ అమలు చేయని కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం 40, 41 డివిజన్లలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, నాయకులు శరవణ, అన్నామలైనాయకర్, ఏఎల్ఎస్ ఆర్ముగం, వెంకట, 12వ డివిజన్‌లో కార్పొరేటర్ మధురెడ్డి, 13వ డివిజన్‌లో నాయకులు వేణు, విజయ్, 14, 15 డివిజన్లలో నాయకులు శిరీష్‌రెడ్డి, హేమారెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. హామీలను చూస్తే భయమేస్తోందని అసెంబ్లీలోనే సీఎం చెప్పడం, రాష్ట్రాన్ని అమ్మేయాల్సిందేనని మంత్రులు చెబుతుండడం సిగ్గు చేటన్నారు. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా, నష్ట పరిహారం, రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం ఇచ్చి రైతులను ఆదుకుందన్నారు. ప్రస్తుతం పొగాకు, వరి, మిరప, శనగ, కంది, జొన్న పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. గ్రామాల్లో పర్యటించాలంటే కూటమి నాయకులు వణుకుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పేకాట, మద్యం బెల్టుషాపులు సారా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, గుడిపాల పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాష్, సర్పంచ్ మధుసూదన్, కార్పొరేటర్ శోభ, నాయకులు హరీషారెడ్డి, పాస్టర్ ప్రసాద్, సీతాపతి, వెంకటేష్, నౌషద్, నవాజ్, హమీద్, రాజేష్, మురళీరెడ్డి, కిషోర్, ప్రేమ, కుమార్, గోపి, అప్పు, నరేష్, జాషువా, రాజన్‌బాబు, మనోహర్, విజయపరమేశ్వర, కుమార్, వేణు, లక్ష్మణ్, సుబ్రమణ్యం, మోహన్, అనిల్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మురుగేశ్, భారతి, శేఖర్, ఖాదర్, బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయానందరెడ్డి



పాల్గొన్న ప్రజలు

భక్తులతో కిటకిటలాడిన సుబ్రమణ్యస్వామి ఆలయం



నోటికి శూలం గుచ్చుకున్న భక్తుడు

వి.కోట: పట్టణంలో వెలసిన సుబ్రమణ్య స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆడి నెల కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కావళ్లు మోశారు. పట్టణంలోని దాసార్లపల్లి చెందిన పలువురు భక్తులు కావళ్లు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఒక భక్తుడు తన నోటికి శూలం గుచ్చుకుని భక్తిని చాటుకున్నాడు.